


# పరదేశీ కథలు

## - చిట్టే సిద్ధ లలిత



-92-

## ఎడారి గొర్రెలు

**ఆగష్టు నెల**.. ఎడారి ఎండ మండి పోతోంది. కాసేపు కూర్చుందామంటే ఎండిన తుప్పలు, పొదలు తప్ప దరిదాపుల్లో చిన్న చెట్టు కూడా లేదు. గొర్రెలు పచ్చని గడ్డిని వెతుకులాడుతూ ఒక చోట వుండకుండా చెల్లా చెదురయిపోయాయి. బాటిల్లో తెచ్చుకున్న నీళ్ళు వేడెక్కి పోయి గుటక వేయడానికే భయం కలుగుతోంది. గొర్రెలను అదిలించే ఓపిక లేక అలాగే నీరసంగా ఒకచోట కూర్చుండిపోయాడు రంగారెడ్డి.

సేటు ఇటు వచ్చినప్పుడల్లా 'ఏంటోయ్ రహీం.. గొర్రెలు బక్క చిక్కి పోతున్నాయి సరిగ్గా మేపడం లేదా' అంటాడు కోపంగా.

ఆ సేటుకు గొర్రెల మీదున్న శ్రద్ధ సాటి మనిషి మీద లేకపోయింది. రహీం అసలు పేరు రంగారెడ్డి. కానీ సేటు తన పని మనుషులకు అరబిక్ పేర్లను పెట్టి పిలుస్తాడు. ఇదే నీ పేరు అని బలవంతంగా ఒప్పిస్తాడు.

పాపం పని మనుషులు భయంతో నోరు మెదపకుండా సరే అంటారు. పిలిస్తే పలుకుతారు. తప్పయినా తప్పని పరిస్థితులు.

అదంతా కువైట్ సిటీకి 30 కిలో మీటర్ల దూరంలో వున్న ఎడారి ప్రాంతం. 10 ఎకరాల స్థలంలో గొర్రెలకు కంచె వేసిన షెడ్లు ఓ వైపు, మరోవైపు రంగారెడ్డి కోసం చిన్న రేకుల షెడ్డు వున్నాయి. చుట్టూ అక్కడక్కడా అప్పుడప్పుడూ గొర్రెలు కాచుకునే వాళ్ళు తప్ప ఎక్కడా మనవమాత్రుల అలికిడి వినబడదు. ఎవరి జాడా కనబడదు. మనుషులు కరువై పోయి, మాటలకు, మమతలకు మొహం వాచి పోయి దిగాలుపడి వుంటారు వాళ్ళు.

అవతల కిలో మీటర్ దూరంలో శీను అనే తెలుగోడు ఒకడు ఇలాగే గొర్రెలు మేపుతూ వుంటాడు. వాడు గోదావరి ప్రాంతం నుండి వచ్చాడు. వాడి సేటు వాడి పేరును కూడా సలీం గా మార్చేసాడు.

శీను ఇంటర్ దాకా చదివి డ్రైవింగ్ నేర్చుకుని మంచి ఉద్యోగం చెయ్యాలని ఎంతో ఆశతో కొయేటుకు వచ్చాడు.

ఇక్కడ వాడి పప్పులేమీ వుడకలేదు. అక్కడ ఊళ్ళో ఏజంటు కువైట్ లో మంచి ఉద్యోగం అని మాయ మాటలు చెప్పాడు. ఇక్కడి ఏజెంటు శీనూను తెచ్చి గొర్రెలాగా సేటుకు అమ్మేసాడు. సేటు సంతోషంగా శీనును తీసుకొచ్చి ఈ ఎడారిలో గొర్రెల దగ్గర కాపలాకు వదిలి పెట్టాడు.

ఇక ఇక్కడే.. రోజులు కాదు, నెలలు కాదు, ఎన్నేళ్ళయినా సరే సేటు కనికరించి ఇంటికి పంపాల్సిందే. లేకపోతే ఈ ఎడారిలోనే గొర్రెల్లాగా చావాల్సిందే తప్ప తప్పించుకునే మార్గం ఎక్కడా వుండదు.

అందరి పరిస్థితీ అంతే. ఏజెంట్ల మోసానికి బలి పశువులుగా మారి మండుటెండలో గొర్రెలు మేపుతూ గొర్రెలతో స్నేహం చేస్తూ, వాటినే మిత్రుల్లా, ఆత్మీయులుగా, బిడ్డలుగా భావిస్తూ, వాటితో మాట్లాడుతూ కాలం గడుతారు. వసతులు లేని మండే ఎడారిలో నరకయాతన అనుభవిస్తారు. ఒక్కోసారి దుర్భర పరిస్థితుల్లో దిక్కులేని చావు చస్తారు. పని మనుషుల ప్రాణాలకు విలువ ఏముంటుంది.

ఎండే కాదు చలి కాలం చలి కూడా పులిలా వేధిస్తుంది. చల్లగా మైనస్ డిగ్రీలకు వెళ్ళిపోతుంది. భరించడం కష్టమే. అదొక బాధ. పాపం శీను అపుడపుడూ.. వారానికో పది రోజులకో అలా పరిగెత్తుకోని వచ్చి ఒక 5 నిముషాలు మాట్లాడి మరలా వెంటనే వెళ్ళిపోతాడు.

"మనుషులు కనబడక మాట్లాడక పిచ్చెక్కి పోతోంది మామా" అంటాడు.

"మామా అని పిలుస్తాండావు. నా కూతుర్ని చేసుకుంటావా ఏంది" అని పరాసికాలు ఆడతాడు రంగారెడ్డి.

"ఇస్తే ఎందుకు చేసుకోను మామా. అయితే నువ్వు ఐదు లచ్చలు కట్నం రెడీ చేసుకో" అని నవ్వుతూ బదులు చెప్తాడు శీను.

ఎపుడైనా వీలయినపుడు వాడు ఇక్కడికి వచ్చి పలకరించి పోతాడు అంతే. మరో మనిషి కనపడటం చాలా అరుదు. అపుడపుడూ గొర్రెల మందలతో దారితప్పి వచ్చే గొర్రెల మేతగాళ్ళు తప్ప.

ఈ ఎడారిలో తిండీ తిప్పలు లేకుండా ప్రాణాలను కళ్ళలో పెట్టుకుని కాలాన్ని గడుపుతుంటే కువైట్ సేటుకు కాస్తయినా కనికరమే లేదు. బండబారిపోయిన హృదయాలు వీరివి. రెండేళ్ళు ఎటూ తప్పించుకుపోవడానికి లేదు. ఇప్పటికి ఇక్కడికి వచ్చి ఏడు నెలలు గడిచాయి.

ఈ ఎడారి మధ్యలో వుండటానికి ఈ చిన్న రేకుల షెడ్డులో కనీస అవసరాలకు కూడా ఏ వసతులూ సేటు కల్పించలేదు. పనికోసం పరదేశం వచ్చిన మనిషిని గొడ్డులా చూస్తున్నాడు ఈ సేటు. వారానికి ఒకసారి వస్తాడు. రెండు కేజీల బియ్యం, ఉప్పు, పప్పు, టీ పొడి ఇచ్చి చక్కా పోతాడు. స్టవ్ పై కాస్త అన్నం వండుకుని తినాలి. నాలుక.. కూరల రుచిని ఎప్పుడో మరిచి పోయింది. రోజూ ఉప్పేసుకుని నీళ్ళు కలుపుకుని తినడమే. ఎవరో

ఇచ్చారని శీను కాస్త ఊరగాయ తెచ్చి ఇచ్చాడు. నాల్రోజులు దాంతో గడిచింది.

ఇంటిది వండిపెట్టే రాగిపిండి సంగటి, చింతపండు ఊరిమిండిని తలచుకున్నప్పుడల్లా నోరు ఊరిపోతోంది.

ఇంకెన్నాళ్ళో? ఎన్నేళ్ళో ఈ నరకం. రెండేళ్ళు గడిచే దాకా బొందిలో ప్రాణం వుంటుందా..

ఒకవేళ గడువు ముగిసినా ఈ సేటు దయతలచి ఇంటికి పంపిస్తాడా. సందేహమే.

ఆ రోజులు ఎంత బావుండేవి. మూడుపూటలా వున్నదేదో తిని ఊళ్ళో హాయిగా తిరిగే వాడు. అయినవారి మధ్యలో కష్టసుఖాలు పంచుకుంటూ సంతోషంగానే వుండేవాడు. పంటలు సరిగా పండలేదని, అప్పులు మిగుల్తున్నాయని భావించి కొయేటుకు పోవాలనే నిర్ణయం తీసుకుని పెద్ద తప్పు చేసాడు.

అదే పొరపాటయింది. ఇప్పుడు ఈ ఎడారి మధ్యలో గొర్రెలు కాచుకునే బతుకయిపోయింది.

ఇక్కడ అధ్వాన్నంగా చచ్చినా చూసేవాళ్ళు ఎవరూ లేరు. పైన కాసే ఎండను భరించలేక, కింద కాగే ఇసుక నేలపై కూర్చోలేక అవస్థ పడ్డాడు రంగారెడ్డి.

పొద్దు అలా పడమర వైపు వాలగానే గొర్రెలను షెడ్డులోకి మర్లించాడు.

ఎందుకో నలతగా అనిపించింది. అన్నం వండుకునే శక్తి లేదనిపించి నిస్త్రాణగా మంచం మీద వాలిపోయాడు.

ఈ పూటకు రొట్టె తిని పడుకుంటే సరి అనుకుంటూ నిద్రలోకి ఒరిగాడు.

"ఓ రంగారెడ్డి మామా.. ఇంకా పొద్దు గూకలేదు మంచానికి అడ్డం పడి నిద్ర పోతున్నావు. ఏందయ్యా.. ఏమయింది నీకు" గట్టిగా అరుస్తున్నాడు శీను.

మెలకువ వచ్చి కళ్ళు భారంగా తెరిచి శీనును చూసాడు రంగారెడ్డి.

"అరె మామా ఏమయింది నీకు. ఏంది అలా కనపడుతున్నావ్" అంటూ వచ్చి చెయ్యి పట్టుకుని చూసాడు శీను.

జ్వరంతో వళ్ళు కాలిపోతోంది. కళ్ళు నిప్పు కణికెల్లా వున్నాయి.

"అయ్యో ఏంది సామీ నువ్వు. ఇట్టయితే బతికేది ఎట్ట. నీ కత ఇలాగే ఈ ఎడారిలో ముగిసిపోతాది. కొంచెం తిని ఒక మాత్ర అన్నా ఏసుకొని పడుకో. జ్వరం తగ్గుతాది. ఇట్టా చిన్న పిల్లోడి మాదిరి ఇంటి మీద దిగులు పెట్టుకుంటే అవుతాదా చెప్పు. గడువు తీరకుండా ఇక్కడ నుండి చీమ కూడా తప్పించుకొని పోలేదు కదా.

ఇంకో సంవత్సరం అయినా ఓపిక పట్టు మామా. తరువాత సేటుకు ఏదో ఒకటి చెప్పి ఇంటికి ప్రయాణం అవుదువు" అన్నాడు అనునయంగా శీను.

నీరసంగా నవ్వాడు రంగారెడ్డి.

"ఈ ఎడారిలో ఎండ దెబ్బ కొట్టి రాయచోటి వెంకటయ్య దిక్కులేని చావు సచ్చినాడంట శీనూ. శవం కూడా ఇంటికి పోలేదు. సేటు వచ్చి శవాన్ని చూసేటప్పటికి వారం రోజులు పట్టిందట. అప్పటికే ఆకాశంలో గద్దలు, నేల

మీద చీమలు సగం పీక్కు తిన్నాయట. కుళ్ళిపోయిన శవాన్ని ఇక్కడే గుంత తీసి పూడ్చి పెట్టేసి వెంకటయ్య పెళ్ళానికి దుడ్డు పంపించి చేతులు దులుపుకున్నాడంట సేటు.

ఈ ఎండకు ప్రాణం పోతాంది శీనూ. ఈ ఎడారిలో రోజుల లెక్క కూడా తెలియడం లేదు.

ఎటు చూసినా కంటికి దుమ్ము ఇసక తప్ప నర మానవుడు కనబడటం లేదు. ఏం చేసేది. ఎన్నాళ్ళని ఇలా బతికేది.

ఖర్మ కాలి పంటలు పండక అప్పుల పాలయ్యి దుడ్డు సంపాదించుక పోదామనే ఆశతో కొయేటికి వస్తిని.

ఆ ఏజంట్ కువైట్ ఇంట్లో పనికి పెడతాడనుకున్నాను కానీ ఇలా ఎడారిలో తోస్తాడు అనుకోలేదు.

మన అడివన్నా మేలు. చెట్లు, చేమలు, ఆకులు, పండ్లు వుంటాయి. పక్షులు, జీవాలు తిరుగుతాయి.

ఇక్కడ పైన ఆకాశంలో గద్దలు, కింద ఎడారి సర్పాలు తప్ప ఏముండాయి. చచ్చినా చూసే దిక్కు లేదు. శవం ఇంటికి పోతాదనే ఆశలేదు. ఇక్కడికి వచ్చినా కూడా నాకు పట్టిన శని, దరిద్రం వదల్లేదు." ఏడ్చాడు రంగారెడ్డి.

"అయ్యో మామా.. చిన్న పిల్లోడి మాదిరి ఏడుస్తావెందుకు. ఎంతమంది ఈ ఎడారిని జయించి ఇంటికి పోలేదు. తల్లో వెంట్రుకలంత మంది తిరిగి ఇండియా పోయారు. నువ్వు ఒక్కడివే కాదు. ఊరుకో.ఏదన్నా తిని మాత్ర వేసుకో జ్వరం తగ్గుతాది. నేను మరలా రేపు వస్తాను. భయపడవద్దు" చెప్పాడు శీను.

పైకి గంభీరంగా రంగారెడ్డికి ధైర్యం చెప్పాడే కానీ శీను హృదయం కూడా లోలోపల గుక్కపెట్టి ఏడ్చింది.

చెమ్మగిల్లిన కళ్ళను రంగారెడ్డి చూడకుండా మొహం అటు తిప్పుకుని "ఇంకో ఆర్నెల్లు గడవాలి అంతే. తరవాత ఇంటికి పోయి పెళ్ళి చేసుకుని హాయిగా వుంటాను" తనకు తానే ధైర్యం చెప్పుకున్నాడు. రంగారెడ్డి కాస్త తిన్నాక మాత్ర మింగించి చీకటి పడిపోయిందని కంగారు పడుతూ తూర్పు వైపు పరిగెత్తి పోయాడు శీను.

మరలా చీకటితో పాటూ ఒంటరితనం చుట్టుముట్టింది రంగారెడ్డిని. దూదిలాంటి తెల్లటి ఇడ్లీలు, దోసెలు తిని ఎన్ని రోజులయ్యిందో నిట్టూర్చాడు. జ్వరంలో వున్న మనిషికి ఇడ్లీలు గుర్తుకు రావడంలో ఆశ్చర్యమేమీ లేదు.

మరుసటి రోజు పొద్దున్నే పైకి లేవలేకపోయాడు రంగారెడ్డి. జ్వర తీవ్రత మరింత పెరిగింది. రాత్రంతా కలవరింతలు, పీడ కలలతో ఉలిక్కిపడుతూ గడిచింది. ఇండియాలోని భార్యా పిల్లలు గుర్తొచ్చి హృదయం బాధతో మూలిగింది. కోరి కోరి కొరివితో తల గోక్కోవడమంటే ఇదే కదా.

కువైట్ రావడమే తప్పయింది. లేకపోతే తనింట్లో భార్య సపర్యలు చేస్తుంటే వేళకు తిని కంబళి కప్పుకుని హాయిగా పడుకొని వుండేవాడు. తెల్లారిపోయింది గొర్రెలకు నీళ్ళు పెట్టాలి అనుకుంటూ పైకి లేవబోయాడు. శక్తి సరిపోక కళ్ళు తిరిగి మరలా మంచం మీదనే కూలబడ్డాడు.

పాపం గొర్రెలు బిడ్డల్లాంటివి. తననే నమ్ముకున్నాయి నీళ్ళు పెట్టాలి గొణుక్కున్నాడు. కళ్ళు మూతలు పడ్డాయి.

పొద్దు వాలినట్లుంది.

శీనూ వచ్చి "మామా ఓ మామా" అని పిలుస్తూ భుజం పట్టి కుదిపి మొహాన నీళ్ళు కొట్టేవరకూ స్పృహలోకి రాలేదు రంగారెడ్డి.

కంగారు పడ్డాడు శీను. కాసిన్ని పాలు స్టవ్ మీద కాచి బ్రెడ్ ముక్కలు తినిపించి పెనడోల్ మాత్ర ఒకటి వేసాడు శీను.

కొంచెం తెప్పరిల్లాడు రంగారెడ్డి. "శీనూ.. వయసులో చిన్నోడివి నీకు దండం పెట్టకూడదు. నువ్వు లేకపోతే, సమయానికి రాకపోతే చచ్చిపోయేవాడిని. అలాగే పోయి ఆ గొర్రెలకు నీళ్ళు పెట్టి కాస్త గడ్డి వెయ్యి నీకు పుణ్యం వుంటుంది" అర్థించాడు రెడ్డి.

"అయ్యో దానికేముంది మామా వేస్తాలే" అంటూ గొర్రెల దగ్గరికి పోయాడు.

కాసేపటికి "మామా ఓ మామా.." అని పిలుస్తూ రొప్పుతూ షెడ్డు లోపలికి పరిగెత్తుకొచ్చాడు శీను.

మగత నిద్రలో వున్న రంగారెడ్డి శీను కేకలకు ఉలిక్కిపడి లేచి "ఏమయింది" అని అడిగాడు.

"మామా.. పెద్ద పాము గోధుమ రంగులో వుంది. నీళ్ళు పెడుతున్న నన్ను దాటుకుని గొర్రెల షెడ్డు పక్కన వున్న పుట్టలోకి పోయింది. కొంచెం వుంటే తొక్కేవాడిని" అన్నాడు భయంగా.

"అరే పామును చూసి భయపడినావా. సర్లే నాకు రోజూ రెండు మూడన్నా కనపడుతాయి. అదొక్కటే కాదు వందల విష సర్పాలు వుంటాయి ఈ ఎడారిలో. ముందు నేనూ భయపడే వాడ్ని. ఇప్పుడు అలవాటయింది శీనూ" అన్నాడు రంగారెడ్డి.

బ్రెడ్ తిని మాత్ర మింగడంతో కాస్త జ్వరం తగ్గినట్లుంది. తెప్పరిల్లాడు రంగారెడ్డి. ఇక పరవాలేదు అనుకుంటూ "సరే మామా చీకటి పడింది. ముందే నాకు పాములంటే చచ్చేంత భయం. నేను వెళ్ళి మళ్ళీ వీలయితే రేపు వస్తా. మా సేటు గనుక వస్తే రేపు నేను ఇక్కడికి రాలేను. సేటు చూస్తే తిడతాడు. తరువాత మరో రోజు వస్తాను. నువు జాగ్రత్త" అని చెప్పి గబ గబా అక్కడినుండి పారిపోయాడు శీను.

మరుసటి రోజు రంగారెడ్డికి జ్వరం తగ్గిపోయి వంట్లోకి శక్తి వచ్చింది. "హమ్మయ్య బ్రతికిపోయాను" అనుకున్నాడు రంగారెడ్డి.

"ఈ రోజు శీను వస్తాడో రాడో. అతడి సేటు కనుక ఇటువైపు వస్తే రాలేడు పాపం" అనుకుంటూ లేని ఓపిక తెచ్చుకుని గొర్రెలను మేతకు తోలుకుని పోయాడు.

"తొందరగా రోజులు గడిచిపోతే బాగుండు. రెండేళ్ళ కాంట్రాక్ట్ పూర్తి కాగానే ఇండియాకు పోవచ్చు" అని

మనసులో ఇక్కడ గడిచిన రోజుల లెక్కలు వేసాడు.

ఇంకా ఇక్కడ ఈ ఎడారిలో గొర్రెలకు కాపలాగా గడపాల్సిన రోజులను కూడా వేళ్ళతో లెక్కించి గుర్తు పెట్టుకున్నాడు. తను విమానం దిగి వెళితే సంతోషంగా వెలిగే భార్య మొహం గుర్తొచ్చి చిన్న చిరునవ్వు పెదవుల పైకి పాకింది. దానికి రెండు జపాన్ చీరలు తీసుకెళ్ళాలి. పిల్లలు ఎలా చదువుతున్నారో ఏమో. వారి క్షేమ సమాచారాలు తెలిపేందుకు ఈ ఎడారికి ఉత్తరాలు కూడా రావు. వెళ్ళేటప్పుడు వాళ్ళకు బట్టలు, చెప్పులు, చాకులేట్లు అన్నీ కొనుక్కెళ్ళాలి.

ఆలోచనల్లోకి కూరుకుపోయి పరిసరాలను గమనించలేదు రంగారెడ్డి. గొర్రెలను అదిలిస్తూ జోరుగా అడుగులు ముందుకు వేసాడు. బుస్ బుస్ మనే శబ్దంతో ఈ లోకంలోకి వచ్చి ఉలిక్కిపడి చూశాడు. ఇసుకలో కలిసిపోయిన గోధుమ రంగు తాచు పాము పడగ ఎత్తి కాలిపై కాటేయబోతోంది.

భయంతో అడుగు వెనక్కి వేసాడు రంగారెడ్డి. ఇసుకలో కూరుకు పోయిన పాదాలు అంత సులభంగా పైకి రాలేదు. ప్రాణ భయంతో వెల్లకిలా పడిపోయాడు రంగారెడ్డి. మృత్యువు ఎక్కడ, ఏ రూపంలో, ఎలా పొంచి వుంటుందో ఎవరికి తెలుసు. పడగ ఎత్తిన పాము కాటేయక మానదు.

ఆఖరి క్షణాల్లో ఇండియాలోని భార్య, పిల్లలు కళ్ళముందు కదలాడారు. ఎడారి ఇసుకలో నిస్సహాయంగా నేల జారి పోయాడు రంగారెడ్డి.

సేటు వచ్చి పనులేవో అప్పజెప్పడంతో మరుసటిరోజే కాదు మరో రెండ్రోజులు కూడా ఇటువైపు రాలేకపోయాడు శీను. మూడోరోజు శీను వచ్చేసరికి అక్కడ సేటు ఇంకో మనిషితో గుంత తవ్విస్తున్నాడు. చుట్టూ నిశ్శబ్దం నిండుకొని వుంది.

మనసు కీడును శంకిస్తుంటే నోరు పెగుల్చుకుని "ఏం జరిగింది బాబా.. రహీం మామ ఏడీ" అని అడిగాడు.

"రహీం పాము కరిచి చనిపోయాడు. గొర్రెలు మేపడానికి కొత్త పనివాడ్ని తీసుకొచ్చాను. అదృష్టమే.. శరీరాన్ని ఇంకా రాబందులు పీక్కుతినలేదు. పూడ్చిపెడితే ఒక పనయిపోతుంది. రహీం కుటుంబానికి రెండు లచ్చలు డబ్బు పంపిస్తాను. వాడి పెళ్ళాం, పిల్లలు సంతోషంగా కాలం గడపొచ్చు."

మొహంలో ఏ భావమూ లేకుండా ఏ బాధా లేకుండా మామూలుగా జవాబు చెప్పాడు సేటు.

ఆప్యాయంగా పలకరిస్తూ.. నా కూతుర్ని చేసుకో శీనూ అని అడిగే రంగారెడ్డి మామ ముఖం గుర్తొచ్చి దు:ఖం ముంచుకొచ్చింది శీనుకు. ఇక అక్కడ వుండలేక కన్నీళ్ళను తుడుచుకుంటూ తన షెడ్డు వైపు వెళ్ళిపోయాడు శీను.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments